# అబ్బో! భ్రమరాంబ!

భార్గవి భాస్కరరావ్ దంపతులకు లేకలేక ఒక ఆడపిల్ల పుట్టింది. అసలే వీళ్ళది బోల్డు ఆస్తి! ఈ ఆడపిల్ల పుట్టిన తర్వాత ఆ ఆస్తి రెట్టింపయింది.!

పిల్లకి యుక్త వయసొచ్చింది. ఓ మంచి సంబంధం నిశ్చయించారు. భార్గవి, తన కూతుర్ని "అమ్మాయ్! అనూరాధా! నీ వివాహ సందర్భంలో నీకేమైనా ప్రత్యేకమైన కోరికలుంటే చెప్పు! నీ ముచ్చట్లన్నీ తీరుస్తాం" అంటూ అడిగింది.

"ప్రత్యేకంగా ఏమీ లేవు కాని, పెళ్ళికి వచ్చిన ముత్తైదువు లందర్నీ చాలా ఆప్యాయంగా చూడండి. వాళ్ళకి ఏం లోటు లేకుండా చెయ్యాలి!"

"అదేమిటే! ప్రత్యేకంగా ఆడవాళ్ళ గురించే చెపుతున్నావ్! మరి మగవాళ్ళకి మర్యాదలు చెయ్యక్కర్లేదా?"

"అలా అని కాదు! ఆడవాళ్ళకయితే పెళ్ళితంతు మీదే ధ్యాస ఉంటుంది! మగాళ్లయితే ఏ సిగరెట్ కాల్చుకుంటూ, బాతాఖాని కొట్టుకుంటూ కొంతమందీ, పేకాట ఆడుతూ కొంతమంది కాలక్షేపం చేసేస్తారు"

"నిజమే! అలాగే చేద్దాం!" అంది భార్గవి.

పెళ్ళి సందర్భంగా పెద్ద మ్యారేజి ఫంక్షన్‌హాల్ అద్దెకి తీసుకున్నారు. అందులో మగపెళ్ళివారికి ఆడపెళ్ళివారికి విడివిడిగా గదులున్నాయ్. చాలామంది ఆడపెళ్ళివారు ఓ రెండ్రోజులు ముందే వచ్చేశారు. పెళ్లి ముహూర్తానికి ఓ రోజుముందే ఫంక్షన్ హాల్‌కి వెళ్ళి పోయారు.

అక్కడ ముత్తైదువలకి గోరింటాకు పెట్టే ఏర్పాటు చేశారు. జుట్టు నెరసిపోయి షష్టిపూర్తయిన ఒకావిడ్ని చూసి "అదేమిటి అత్తా! నీకంటే చిన్న వాళ్ళందరూ, జుట్టుకి రంగేసుకుని తిరుగుతూంటే నువ్వు మాత్రం నిజాయితీగా నీ తెల్లని జుట్టుని తేటతెల్లం చేస్తున్నావ్" అంది ఓ ప్రౌఢ.

"ఎవరు ఇంత చనువుగా ఈ మాటలంటూన్నది" అని పరిశీలించిన ఆ పెద్ద ముత్తయిదువ, "ఓ నువ్వా తల్లీ! నువ్ పెద్ద గడుగ్గాయ్‌వి. నువ్వు వస్తేకాని ఏ పెళ్ళీ రక్తి కట్టదు. అయినా నాకు మొన్ననే అరవై దాటి పోయింది. రంగు వేసుకుంటే బాగుంటుందేమో కాని వేసుకునే ఓపిక లేదు".

"పోనీ మామయ్య చేత వేయించుకుంటావా" అని వేళాకోళం చేసింది ఆ ప్రౌఢ.

"నాకంటే మీ మామయ్య పెద్ద కదే! నాకే ఓపిక లేదంటుంటే ఆయనకి ఓపిక ఎక్కడుంటుంది."

"పెళ్ళాం విషయమంటే మగాళ్ళకి ఎక్కడ లేని ఓపికా వస్తుందిలే!"

"ఇక చాలు వెళ్ళు!" అంది ఆ పెద్దావిడ.

ఈ ప్రౌఢ వెళ్ళి భార్గవితో "గోరింటాకు పెట్టిస్తున్నదానివి పన్లోపని మన చుట్టాలలో

కొంత మంది జుట్టుకి రంగు వేసే ఏర్పాట్లు కూడా చెయ్యకపోయావా పిన్నీ" అంది.

"చాలా మంచి సలహా యిచ్చావ్! అదెంత పనీ" అని వెంటనే ఆ రంగు వేసే ఏర్పాటు చేసింది భార్గవి.

ఈ విషయం చాలామందికి తెలిసింది.! కొంత మందైతే తాము యింతకుముందు జుట్టుకు రంగు వేసుకుంటూన్నట్లు తెలుస్తుందని, "అసలు మా జుట్టు నెరవందే" అనీ, మరికొంతమందైతే "మేమూ డిటోయే" అనీ, అయినా జుట్టుకి రంగు వేయించుకుని మన తోటి సంఘజీవులను మభ్యపెట్టి మోసం చేయడం తప్పనీ అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి కోవకి చెందిన ధైర్యవంతులు "రంగువేసే కార్యక్రమం మొదలవగానే మాకు తెలియచేయ"మన్నారు.

మొత్తం మీద గోరింటాకు పెట్టడంతో పాటు, జుట్టుకి రంగు వేసే కార్యక్రమం మొదలైంది.!

దేనికి ముందు వెళ్ళాలో తెలీలేదు కొంతమందికి! అయినా పెళ్ళి ముహూర్తానికి ఇంకా ఓ రోజు వ్యవధి ఉంది కదా!, అప్పనంగా వేయించుకునే దానికి పెద్ద ఆలోచన ఎందుకు అని తమ యిష్టప్రకారంగా ఎగబడ్డారు.

జుట్టుకి రంగు బాహాటంగా వేయడం లేదనీ, ఈ కార్యక్రమం తలుపులు వేసేసిన గదుల్లో జరుగుతోందని తెలిసిన కొంతమంది సిగ్గు పడకుండా రంగు వేయించుకున్నారు.

ఈ గోరింటాకు పెట్టడం, రంగు వెయ్యడం సాయంకాలం దాకా జరుగుతూనే ఉంది!.

సాయంకాలం ఎంత డబ్బు ఇవ్వాలో లెక్కచూసారు. గోరింటాకు లెక్క సరిపోయింది కాని, జుట్టుకిరంగు వేసిన లెక్కలో ఓ పాతిక తలకాయలు ఎక్కువ లెక్క కట్టినట్లు అనుమానం వచ్చింది పెళ్లి మేనేజర్‌కి. ధైర్యవంతులు ముందుకు వచ్చి, 'మేమైతే మా జుట్టుకి రంగు వేయించుకున్నాం. మిగిలిన వారి సంగతి మాకు తెలీదు!" అన్నారు.

ఒకావిడ అయితే రంగు వేయించుకుంది కాని ముందుకు వచ్చి నిజం చెప్పలేదు. ఆవిడ పేరు అచ్చమాంబ. "ఏం అచ్చమాంబ! లెక్క తేలక చస్తూంటే నువ్ లోపల లోపల నక్కుతావేం! జుట్టుకు రంగు వేయించుకోవడం తప్పులేదు కాని, లెక్క తేలక తలలు పట్టుకున్నప్పుడు నిజం ఒప్పుకోకపోవడం తప్పు" అంది భ్రమరాంబ.

"ఇదిగో వస్తున్నా!" అంటూ ఇక తప్పదని 'కాలు నొప్పిగా ఉంటేనూ మెల్లగా వస్తున్నాను' అంటూ, ముందుకి వచ్చింది అచ్చమాంబ.

మొత్తం మీద ఓ కూర ఆకు అటూ ఇటూ చేసి సొమ్ము ముట్టచెప్పారు రంగు వేసినవారికి.

"అది కాదు భ్రమరాంబా! అచ్చమాంబ రంగు వేయించుకున్నట్లు చెప్పడానికి సిగ్గు పడుతూంటే దాన్ని బయటకి ఎందుకు లాగావే" అంది ఓ చుట్టాలావిడ.

"దాని విషయం నీకేం తెలుసు. ఈ భార్గవీ వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళని మా ఆయనతో దెబ్బలాడి ఓ పట్టుచీర అయిదువేలు పెట్టి కొనిపించుకున్నాను. ఈ రోజు పొద్దున్న ఆ చీర మనవాళ్ళకి చూపిస్తూంటే "చీర రంగు ధాతుగా లేదనీ, చీర అంచు చిన్నది అయిపోయిందని ఏమిటేమిటో కూసింది." నా మనస్సు నీరైపోయింది. రెండేళ్ళ క్రితం మన పెద్దబ్బిగాడి పెళ్ళిలో ఒక పట్టుచీర యిమ్మని నన్ను తినేసింది. పెళ్ళయిన తర్వాత నాకు తిరిగి యివ్వలేదు సరికదా, "నీ కిచ్చేశాను" అంటూ దబాయించింది. ఆ చీరగాని దాని దగ్గర మళ్ళీ చూసానో, దాన్ని ఏనుగుల చేత తొక్కిస్తాను.! ఈ భ్రమరాంబ అంటే ఓ మతిభ్రమించిన ఎందుకూ పనికిరాని పిచ్చిదనుకుంటుందేమో మరి! అదే పెళ్ళిలో నావి రెండు 'గాద్రెజ్ హెయిర్ డై' ప్యాకెట్లు దొబ్బేసింది. పైగా పెళ్ళిలో రెండ్రోజులూ నా సబ్బుతో ఒళ్ళు తోముకుని తోముకుని అరగ తీసేసింది. 'ఏమిటి! ఈ సబ్బు యిలా అరగతీసేసావ్ నా జీతమెంతో తెలుసా' అంటూ మా ఆయన నన్ను చివాట్లు పెట్టారు. తెలుసా!" అంటూ వీరావేశంతో ఊగిపోయింది, భ్రమరాంబ.

"అబ్బో! ఏమిటో అనుకున్నాను! నీతో చాలా జాగ్రత్తగా ఉండాలే బాబూ! పోన్లే ఆ అచ్చమాంబతో ఈ పెళ్ళిలో గొడవ పెట్టుకోకు! భార్గవి చుట్టాలంతా మనల్ని అలగాజనం అనుకుంటారు.

"అదికాదే నా ఆత్మ క్షోభించేటట్లు చేస్తే నాకు ఒళ్ళు తెలీని కోపం రాదంటావా!" అంది భ్రమరాంబ.

"సరే! పోనీలే!"

మహిళలు గోరింటాకు పెట్టుకున్న తమ అందమైన చేతులతో, నల్లని జుట్టుతో, మెరుస్తున్న వాలు జడలతో, సిగలతో, సిగలోని పూలతో పట్టుచీరలతో పెళ్ళి పందిరి కళ కళలాడించారు.

పెళ్ళి చాలా శోభాయమానంగా జరిగింది. అచ్చమాంబ, భ్రమరాంబ దగ్గర తస్కరించిన పట్టుచీర మాత్రం ఈ పెళ్ళికి తేలేదు. ఈసారి ఏనుగుల నుంచి తప్పించుకు పోయింది.!

---

(జయంతి జూలై - సెప్టెంబర్ 2011)